B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజా పక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 255 | బుధవారం | 07-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-

కేసీఆర్ కుటుంబానికి నోటీసులు!

ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష...



- ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్టు గుర్తింపు
- రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు
- అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం
- జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచన

వారు చేసింది దేశద్రోహమే

మన ప్రజాపక్షం,ఢిల్లీ

ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నలుగురూ కలిసి దేశానికి వ్యతిరేకంగా 'ఓటు చోరీ'

మోదీ,షా,సీఈసీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు రాహుల్ గాంధీ

- మోదీ, షా, భగవత్, సీఈసీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు
- వీరు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని మండిపాటు
- లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించిన రాహుల్





ప్రభుత్వ అధినేతగా 25ఏళ్లు

మోదీని ప్రశంసించిన కేబినెట్- కీలక ప్రతిపాదనలకు ఆమోదం

'దేశమే ప్రథమం, పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు వెళ్తున్నారని ప్రశంస

మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేసిన కేబినెట్

మన ప్రజాపక్షం,ఢిల్లీ

25 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు ప్రభుత్వ అధినేతగా పనిచేసిన ప్రధాని మోదీ నాయకత్వాన్ని కేంద్ర కేబినెట్ మంగళవారం ప్రశంసించింది. తొలుత గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడింది. 'దేశమే ప్రథమం, పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొంది. విశేష జనాదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేస్తూ, ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్‌లో వరుసగా మూడుసార్లు సేవలందించిన మోదీ విజయవంతమైన కార్యక్రమాలు చేపట్టారని, అక్కడ అమలు చేసిన పథకాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ దార్శనికతతో ముందుకెళ్తున్నారని క్యాబినెట్ వెల్లడించింది.



కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు..

కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

- కొత్తగా స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి సుమారు రూ. 1200 కోట్ల ఆదా
- కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానం శాశ్వతం
- వచ్చే ఏడాదికల్లా కొత్త వంతెన పూర్తి చేస్తామన్న జీహెచ్ఎంసీ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ గతంలో ప్రతిపాదించిన బహుళ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో సరికొత్తగా డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

గాంధీ జయంతి నాడు మాంసం దుకాణాల మూసివేతపై వివాదం

ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారని పిటిషనర్ ఆరోపణ

కమిషనర్‌పై చర్యలు తీసుకుని, రూ.50,000 జరిమానా విధించాలని అభ్యర్థన

మన ప్రజాపక్షం,హైదరాబాద్

గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక

ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయింది

- మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత
- ప్రజాసేవ చేసేందుకు మాజీ మావోలు తమ పార్టీలో చేరాలన్న కవిత
- వేములవాడ ఆలయంలో మేత, నీరు లేక గోవులు మరణిస్తున్నాయని ఆవేదన
- కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని వ్యాఖ్య

మన ప్రజాపక్షం,వేములవాడ

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రజాసేవ





గోషామహల్‌లో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర

- గోషామహల్‌లో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర: అసదుద్దీన్ ఒవైసీ
- ముస్లిం ఓటర్లే లక్ష్యంగా కుట్ర జరుగుతోందన్న ఒవైసీ
- పెద్ద సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తున్నారని ఆరోపణ
- వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్

మన ప్రజాపక్షం,హైదరాబాద్

గోషామహల్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా తొలగించేందుకు కుట్ర

ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు

- తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు
- నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించారని నిర్ధారణ
- కాంట్రాక్టు నుంచి రెగ్యులరైజ్ అయ్యాక వెలుగులోకి బాగోతం
- మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై కొనసాగుతున్న విచారణ
- ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ విచారణకు జేఏసీ డిమాండ్

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు



All are Continues Second Page

వారు చేసింది దేశద్రోహమే

మొదటి పేజీ తరువాయి

కుట్రకు పాల్పడ్డారని, ఇది ముమ్మాటికీ 'దేశద్రోహం' అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వీరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని హెచ్చరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా మంగళవారం ఇండీ కూటమి ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కదం తొక్కారు. పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు 300 మంది ర్యాలీగా వెళ్లారు. అయితే ఆకాశ్ వాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయాల సమీపంలో భద్రతా సిబ్బంది రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలను అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఆకాశ్ వాణి భవన్ కాంప్లెక్స్ లోపల బైఠాయించిన విపక్ష నేతలు అక్కడి నుంచే తమ నిరసన తెలిపారు.

సీఈసీ రాజీనామా చేయాల్సిందే!

భారీ భద్రత నడుమ ప్రతిపక్ష ఎంపీలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారని సీపీఐ ఎంపీ పి సందోశ్ కుమార్ పేర్కొన్నారు. సీఆర్పీఎఫ్, ఆర్ఏఎఫ్, ఇతర బలగాలతో భద్రతా సిబ్బందిని భారీగా మోహరించి సీఈసీ ప్రధాన కార్యాలయం వైపు వెళ్లకుండా నిలువరించారని చెప్పారు. మరోవైపు, విపక్షాల పాదయాత్రను అడ్డుకున్న తర్వాత, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓ బ్రియన్‌తో సహా పలువురు ప్రతిపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే అరెస్టులు తమ సమస్యకు పరిష్కారం కాదని, సీఈసీ రాజీనామా చేయాల్సిందేనని విపక్ష నేతలు స్పష్టం చేశారు. అంతవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ సమయంలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు లేవనెత్తారని వార్త కథనాలు వెలువడడంతో రాజకీయంగా తీవ్ర దుమారం తలెత్తింది. దీంతో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. అలాగే, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం- 6లో చేసిన మార్పుపై కూడా ప్రతిపక్ష నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కూడా ఈ అంశంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఈసీ రాజీనామా చేసి, క్రిమినల్ చర్యలను ఎదుర్కోవాలని పేర్కొంది.

పోలీసుల అదుపులో రాహుల్

దిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద కొనసాగుతున్న విపక్షాల నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా, అమరీందర్‌సింగ్‌తో పాటు ఇండీ కూటమి నేతలు, కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వం దిశానిర్దేశం

కోల్పోయింది

మొదటి పేజీ తరువాయి

చేసేందుకు తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. వారి రాకతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.పర్యటనలో భాగంగా, వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కవిత పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్ వాడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో నిర్మిస్తేనే ఆలయం వందల ఏళ్లపాటు నిలుస్తుందని, చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తులు సమర్పించిన గోవులు సరైన మేత, నీరు లేక మరణిస్తున్నాయని, వాటికి కనీసం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు కూడా జరపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."అడవిని వదిలేసి వచ్చిన మాజీ మావోయిస్టులు ప్రజా జీవితంలోకి రండి.. మా పార్టీ మీకు మంచి ప్లాట్‌ఫామ్" అని కవిత పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా సిరిసిల్ల-వేములవాడ ప్రాంతంలో సాగునీటి పనులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని, అందుకే ప్రజలు తమలాంటి కొత్త పార్టీల వైపు చూస్తున్నారని విమర్శించారు. అంతకుముందు, ఆమె శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కేసీఆర్ కుటుంబానికి

నోటీసులు

మొదటి పేజీ తరువాయి

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు.సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు.మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రభుత్వ అధినేతగా 25ఏళ్లు

మొదటి పేజీ తరువాయి

ఇదిలా ఉండగా, ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ- ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా 10వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్రవేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఏర్పాటు తోడ్పడనుందని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయ లోపాలను అరికట్టి మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచేలా ఈ సంస్థ పనిచేస్తుందని వెల్లడించారు. 500 కోట్లు పైబడి చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సాంకేతిక అర్హతలను ఏర్పాటు మదింపు చేస్తుందని వివరించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం 10వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటుకు ఆమోదం లభించిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా మీవీజులకు దీర్ఘకాలంలో అవసరమైన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తద్వారా వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడానికి, నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి వీలవుతుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు..

మొదటి పేజీ తరువాయి

కానుంది.సవరించిన ప్రణాళిక ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫఖంజా కాలేజీ వరకు ఆరు లేన్ల స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి) నిర్మించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1 వైపు వెళ్లేందుకు వీలుగా దీనికి ఒక ర్యాంప్‌ను కూడా అనుసంధానిస్తారు. గతంలో ఈ పనులకు సంబంధించి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన 'లెటర్ ఆఫ్ అవార్డు'ను ఉపసంహరించుకుని, కొత్త డిజైన్ బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించారు. భూసేకరణ వ్యయం తగ్గడం వల రూ. 800 కోట్లు, నిర్మాణ ఖర్చు తగ్గడం వల్ల మరో రూ. 400 కోట్లు కలిపి మొత్తం రూ. 1200 కోట్లు ఆదా అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ ప్రాజెక్టుపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ గతంలో తలపెట్టిన హెచ్-సిటీ పనులను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వన్-వే విధానం సత్ఫలితాలను ఇస్తుండటంతో దానినే శాశ్వతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం ఆదా అవుతుందని, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించి, వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్ల నరికివేతపై కోర్టు ఆంక్షల కారణంగా పాత ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. మాదాపూర్, హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు సిగ్నల్-ఫ్రీ ప్రయాణాన్ని కల్పిస్తూనే, పార్క్‌లోని పచ్చదనానికి కనీస నష్టం కలగకుండా ఈ సరికొత్త కారిడార్‌ను ప్రభుత్వం రూపొందించింది.

గోషామహల్‌లో ముస్లిం ఓట్ల

తొలగింపునకు కుట్ర

మొదటి పేజీ తరువాయి

జరుగుతోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా బల్క్ దరఖాస్తుల ద్వారా ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గోషామహల్‌లోని బూత్ నంబర్ 28, 30, 127లో ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందుగానే ప్రింట్ చేసిన ఫారం-7 దరఖాస్తులను సమర్పిస్తున్నారని ఆరోపించారు. ఈ ఓటర్లందరి పేర్లు కనీసం 2002 నుంచి జాబితాలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి 122 దరఖాస్తులు ఎలా సమర్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక బీజేపీ నాయకులు ఉన్నారని ఒవైసీ ఆరోపించారు.బల్క్‌గా, తప్పుడు ఫారం-7 దరఖాస్తులు దాఖలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియను పాత పద్ధతిలోనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

మొదటి పేజీ తరువాయి

తెలిపారు.వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు.ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు

హైకోర్టు నోటీసులు

మొదటి పేజీ తరువాయి

ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(g)) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.



మట్టి పరీక్షా కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి

మట్టి పరీక్షా కేంద్ర భవన నిర్మాణ పనుల పరిశీలన
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన మట్టి పరీక్షా కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటుపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు.మట్టి పరీక్షా



కేంద్రానికి సంబంధించి మిగిలిన పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులకు అవసరమైన నిధులను త్వరగా విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్అండ్బీ అధికారులను ఆదేశించారు. భవనంలో అవసరమైన మరమ్మతులను గుర్తించి, వాటికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు.అందుబాటులో ఉన్న స్థలాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ మట్టి పరీక్షా కేంద్రానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి, మట్టి పరీక్షా కేంద్రాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా ఆర్అండ్బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా అంగన్వాడీ సేవా మిలన్ కార్యక్రమం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లాలోని గానుగపహాడ్ గ్రామంలో అంగన్వాడీ సేవా మిలన్ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జీవన జ్యోతి అధ్యక్షత వహించగా, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ముఖ్య అతిథిగా, సౌడ రమేష్ అధ్యక్షులుగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నపిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. అలాగే గర్భిణీ స్త్రీలకు బలవర్ధకమైన పౌష్టికాహారం మరియు చిరుధాన్యాలతో కూడిన న్యూట్రిషన్ ప్యాకెట్లను అందజేశారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే నిధులన్నీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ ముందడుగు వల్లే అందుతున్నాయని తెలిపారు. దీనివల్ల గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు ఎలాంటి పోషకాహార లోపం తలెత్తకుండా సకాలంలో గుడ్లు, పౌష్టికాహారం అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడీ టీచర్లు ఎంతో ఓపికతో, సమన్వయంతో వ్యవహరిస్తూ పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని, తల్లులకు మరియు పిల్లలకు సరైన ఆహారం అందిస్తూ వారి ఆరోగ్య సురక్షితకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో గానుగపహాడ్ సర్పంచ్ అలేఖ్య మహిపాల్, రాష్ట్ర నాయకులు ఉడుగుల రమేష్, తులసి కళ్యాణి, జిల్లా ఇంచార్జ్ మహిళా మోర్చా నాయకులు పెద్దోజు సంతోషి, కళ్యాణి, స్వప్న, నీలిమ, ఉమారాణి, డాక్టర్ శశిధర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, పెద్దోజు జగదీష్, ఏలబోయిన సంతోష్, దైద రవి, సాంబ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లా విద్యాభివృద్ధికి సహకరించండి

సీఎం ముఖ్య సలహాదారు కే. రామకృష్ణారావుకు బిర్రు ఇస్తారి విజ్ఞప్తి


జనగామ, మన ప్రజాపక్షం:జనగామ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, విద్యారంగ విస్తరణలో భాగంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, కాకతీయ ఇంజనీరింగ్ కాలేజీలను మంజూరు చేయాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారులు కె. రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు.?ఈ సందర్భంగా బిర్రు ఇస్తారి మాట్లాడుతూ జనగామ ప్రాంతంలో విద్యాసంస్థల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాల కావలసిన స్థలంతో పాటు, కాకతీయ పీజీ కాలేజ్ భవనం ప్రస్తుతం సిద్ధంగా ఉందని, దీనికి అనుబంధంగా 15 ఎకరాల విస్తృతమైన స్థలం కూడా అందుబాటులో ఉందని వివరించారు. భవన వసతి, భూమి, ఇతర మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నందున కొత్త విద్యాసంస్థల ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.?జనగామ వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ, అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, ఇంజనీరింగ్ కాలేజ్ వంటి నాణ్యమైన విద్యాసంస్థలు అందుబాటులోకి వస్తే జనగామ ప్రాంతం విద్యా హబ్గా రూపాంతరం చెందుతుందని, స్థానిక విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. కావున ఈ విద్యాసంస్థలను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ?గతంలో రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో జనగామ నియోజకవర్గానికి “అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్” మంజూరు కావడంలో కీలక పాత్ర పోషించి, ఎనలేని సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు. ఆ నిర్ణయానికి గాను జనగామ ప్రజల తరఫున ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా జనగామకు కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ మంజూరయ్యేలా చొరవ చూపి, తగిన సహకారం అందించాలని బిర్రు ఇస్తారి కోరారు.



జనగామ మోడల్ మార్కెట్‌కు వీధి వ్యాపారుల తరలింపు

నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ

జనగామ, మన ప్రజాపక్షం:జనగామ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా మరియు ట్రాఫిక్ ఇబ్బందులు లేని నగరంగా తీర్చిదిద్దే దిశగా జనగామ మున్సిపాలిటీ ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, ఫుట్పాత్లు మరియు ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులను, సంజయ్నగర్లో నూతనంగా నిర్మించిన ఆధునిక మోడల్ మార్కెట్‌కు దశలవారీగా తరలించేందుకు చర్యలు ప్రారంభించింది. ?ఈ మోడల్ మార్కెట్‌ను సుమారు రూ.7 కోట్ల భారీ వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో వ్యాపారులకు మరియు వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా 50 కూరగాయల షాపులు, 65 నాన్-వెజ్ షాపులతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్ సరఫరా మరియు పారిశుధ్య వసతులను అందుబాటులోకి తీసుకువచ్చారు. వ్యాపారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్రమబద్ధమైన వాతావరణంలో జీవనోపాధి పొందేలా ఈ ప్రాంగణాన్ని రూపొందించారు. ?ఈ మోడల్ మార్కెట్లో షాపుల కేటాయింపు కోసం అర్హులైన వీధి వ్యాపారుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఆసక్తి కలిగిన వ్యాపారులు ఈ నెల 07-10-2026 నుండి 10-10-2026 వరకు మున్సిపల్ కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చని మున్సిపల్ యంత్రాంగం తెలిపింది. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ?ప్రధాన రహదారులు మరియు ఫుట్పాత్లపై వ్యాపారాల వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ నిరోధం, పారిశుధ్య సమస్యలు మరియు ప్రజల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరిగింది అని అన్నారు. “వ్యాపారుల జీవనోపాధికి రక్షణ – ప్రజలకు మెరుగైన రాకపోకలు – జనగామకు సుందర రూపం” అనే ప్రధాన లక్ష్యంతో చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి వీధి వ్యాపారులందరూ పూర్తి స్థాయిలో సహకరించి, సంజయ్నగర్ మోడల్ మార్కెట్‌కు మారాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.





ఇండియా కూటమి ఆధ్వర్యంలో జనగామలో భారీ ర్యాలీ

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలి

జనగామ, మన ప్రజాపక్షం:
”సేవ్ డెమోక్రసీ వీక్ – వోట్ బచావో దేశ్ బచావో “ కార్యక్రమాల్లో భాగంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జనగామ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎఐసిసి జనరల్ సెక్రటరీ, టీపీసీసీ ఇన్చార్జ్ సచిన్ సావంత్, జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, వైటిడిఏ మెంబర్, టీపీసీసీ సభ్యులు డా. లక్ష్మీనారాయణ నాయక్, ఎస్ఎస్ఏ రాష్ట్ర చైర్మెన్ గంప వేణు గోపాల్,స్టేషన్ ఘనపూర్ ఎస్ఐఆర్ ఇన్చార్జ్ దుద్దిల్ల శ్రీనుబాబు, జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, సీపీఐ, టీజేఎస్, సమాజ్వాదీ పార్టీ తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

ఓటు చోరీపై రాహుల్ గాంధీ ముందుగానే ప్రజలను అప్రమత్తం చేశారు: సచిన్ సావంత్

ఈ సందర్భంగా సచిన్ సావంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఓటు చోరీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఓటర్ల జాబితాలు, ఓటర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని సచిన్ సావంత్ పేర్కొన్నారు.ప్రజల ఓట్లను దొంగిలించే ప్రభుత్వంగా మోదీ ప్రభుత్వం మారిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతి పౌరుడు తన ఓటు హక్కుపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు.కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ అంశాన్ని ముందుగానే గుర్తించి దేశ ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని సచిన్ సావంత్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, ఓటర్ల తొలగింపు, డూప్లికేట్ ఓటర్లు, చెల్లని చిరునామాలు వంటి అంశాలపై రాహుల్ గాంధీ ప్రజల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఓటర్ల జాబితాలపై ప్రజలకు స్పష్టత కల్పించాలని సచిన్ సావంత్ డిమాండ్ చేశారు.డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ..జనగామలో జరిగిన ఇండియా కూటమి భారీ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ, దేశంలో జరుగుతున్న ఓటు చోరీ ఆరోపణలపై బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కులను, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ఇండియా కూటమి చేస్తున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ జనగామలో జరిగిన ఇండియా కూటమి భారీ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనగామ జిల్లా ఇంచార్జీ ఎండి అబ్బాస్ మాట్లాడుతూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తప్పిదాలకు అమాయక ప్రజల ఓట్లు తీసివేసే పరిస్థితి రావడం దారుణమని రానున్న రోజుల్లో ఇండియా కూటమి పాలనలో ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు.సీపీఐ నేత సాయన్న మాట్లాడుతూ ఓటు చోరీపై బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి చేపడుతున్న పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ర్యాలీ అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్కు అందజేశారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఓటు హక్కు మరియు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ఐక్యంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను కొనసాగిస్తాయని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఇతర నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తరఫున డీసీసీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చంద్ర రెడ్డి, కొత్త కరుణాకర్ రెడ్డి, నూకల బాల్రెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు ఎస్సీ సెల్ వేముల మల్లేష్ , మహిళా కాంగ్రెస్ బడికే ఇందిరా, మైనార్టీ సెల్ మాజిద్ అప్సర్, కిసాన్ సెల్ పిన్నింటి నారాయణరెడ్డి, సేవాదళ్ జాయా మల్లేష్, పట్టణ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు,మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శులు జిల్లెళ్ల సిద్ధారెడ్డి,ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, మేకల సమ్మయ్య,సీపీఐ(ఎం) తరఫున మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు,సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ తరఫున జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజు సాంబయ్య, కళింగ రాజు, జీడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటి రిపేర్ సమస్యలకు డిజిటల్ పరిష్కారం 'రిపేర్ మిత్ర'

జనగామ, మన ప్రజాపక్షం:ఇంట్లో ఏసీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి రకరకాల రిపేర్ సమస్యలు తలెత్తినప్పుడు సరైన, నమ్మకమైన టెక్నీషియన్‌ను వెతకడం సాధారణ ప్రజలకు పెద్ద సవాలుగా మారుతోంది. ఈ రోజువారీ సమస్యకు సాంకేతిక పరిష్కారం చూపాలనే ఆలోచనతో వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని స్వాతి ఓదెల, డా. కె.శ్రీనివాస్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో 'రిపేర్ మిత్ర' అనే వినూత్న డిజిటల్ హోమ్ సర్వీస్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. కస్టమర్లకు పారదర్శకమైన, విశ్వసనీయమైన సేవలను అందించడంతో పాటు, స్థానిక టెక్నీషియన్లకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ వేదిక ప్రధాన లక్ష్యమని వ్యవస్థాపకురాలు స్వాతి తెలిపారు. ఈ 'రిపేర్ మిత్ర' వేదిక ద్వారా ఏసీ రిపేర్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టీవీ, మొబైల్, ల్యాప్‌టాప్, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ రిపేర్లతో పాటు హోమ్ క్లీనింగ్, పెయింటింగ్ వంటి అన్ని రకాల ఇంటి నిర్వహణ సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువస్తున్నారు. కస్టమర్లు తమకు కావలసిన సర్వీస్‌ను ఎంచుకుని, తమ చిరునామా నమోదు చేసి సులభంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు.బుకింగ్ పూర్తయిన తర్వాత టెక్నీషియన్ నేరుగా ఇంటికి వచ్చి సమస్యను పరిశీలించి, కావలసిన రిపేర్ వివరాలు మరియు అంచనా ఖర్చు (ఎస్టిమేషన్) తెలియజేస్తారు. పని చేయించుకోవాలా వద్దా అనే పూర్తి నిర్ణయాధికారం కస్టమర్‌దే కావడం వల్ల, ముందే ఖర్చుపై స్పష్టత లభించి కస్టమర్లలో నమ్మకం పెరుగుతుంది.?ఈ యాప్ కస్టమర్లకు సేవలు అందించడమే కాకుండా, స్థానిక టెక్నీషియన్లకు కూడా కొత్త ఆర్థిక అవకాశాలను తెచ్చిపెడుతోంది. స్థానిక సర్వీస్ ప్రొఫెషనల్స్ ఈ ప్లాట్‌ఫామ్‌లో పార్ట్‌నర్లుగా ఉచితంగా రిజిస్టర్ చేసుకుని, నేరుగా కస్టమర్ల నుంచి సర్వీస్ రిక్వెస్టులు పొందవచ్చు. విద్యార్థి దశలోనే సమాజంలో ఉన్న సమస్యను గుర్తించి టెక్నాలజీ ద్వారా దానికి తగిన పరిష్కారం చూపించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. టెక్నాలజీ అనేది కేవలం చదువుకే పరిమితం కాకుండా నిజజీవిత సమస్యలను తీర్చే సాధనంగా ఉండాలనే ఉద్దేశంతోనే దీనిని రూపొందించినట్లు స్వాతి వివరించారు.ప్రస్తుతం స్థానిక మార్కెట్‌పై దృష్టి పెట్టి అత్యంత నమ్మకమైన సర్వీస్ ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్‌ను సిద్ధం చేస్తున్నామని, భవిష్యత్తులో ఈ సేవలను ఇతర నగరాలకు విస్తరించి దేశవ్యాప్తంగా కస్టమర్లు మరియు టెక్నీషియన్లను అనుసంధానించే విశ్వసనీయమైన ప్లాట్‌ఫామ్‌గా 'రిపేర్ మిత్ర'ను తీర్చిదిద్దుతామని టీమ్ సభ్యులు ధీమా వ్యక్తం చేశారు. ఈ వినూత్న ప్రాజెక్ట్ వెనుక వ్యవస్థాపకురాలు స్వాతి ఓదెలతో పాటు వీణ మిశ్రా, అరవింద్ సల్లివా కీలక పాత్ర పోషిస్తుండగా, ఇంటర్న్‌గా తేజ శ్రీ, జాహ్నవి, అఖిల, నవీన్ దేవరకొండ తమ సేవలను అందిస్తున్నారు. yîuÙ™dÕ{Ù: Repairmithra.in



భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయానికి కదం తొక్కిన బీడీ కార్మికులు

బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలి

భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

భైంసా,మన ప్రజాపక్షం:
బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ. మంగళవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టియుసిఐ ఆధ్వర్యంలో, భైంసా ఐబి వద్ద నుండి బస్టాండ్ వైపుగా, ప్రభుత్వ ఆసుపత్రి ముందు నుండి కోర్టు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. కార్యాలయ సిబ్బందికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టియుసిఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ట రాజన్న మాట్లాడుతూ బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు అనేక సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రజాపాలన అంటే బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ ను దూరం చేయడమేనా అని



విమర్శించారు.వయసు పైబడిన బీడీ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్ పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. 28.02.2014 నాటి కటాఫ్ డేట్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.అనంతరం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూబీడీ కార్మికులు తమ జీవితకాలంలో కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ,వృద్ధాప్యంలో కనీస జీవన భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి బీడీ కార్మికుడికి ఆసరా పెన్షన్ అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే బీడీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,అదేవిధంగా వృద్ధులకు కూడా చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అర్హులైన బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన బీడీ కార్మికుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి పెన్షన్ మంజూరు చేయాలని,వృద్ధాప్యంలో ఉన్న బీడీ కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలని అదేవిధంగా వృద్ధులకు కూడా చేయూత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, జిల్లా కమిటి సభ్యులు కే.లక్ష్మీ, నాయకురాలు వి.గోదావరి,సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టి జిల్లా నాయకులు వి.మహేందర్, పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి కిరణ్ మరియు బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా పొలం రోడ్ల పనులు పూర్తి చేయండి

రైతుల సహకారం తీసుకొని పనులు చేయించండి

అధికారులకు, సిబ్బందికి సూచించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముధోల్,మన ప్రజాపక్షం:
ముధోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పొలం రోడ్ల పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.మంగళవారం బైంసాలోని తన నివాసంలో ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, టిఏలు, ఈసీలతో సమీక్షా సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.వివిజీ రాంజీ పథకంలో గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లకు పెద్ద మొత్తంలో నిధులు ఉన్నాయని, రోడ్లు వేసి, రైతులకు సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా పనులు చేయాలని సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరు రైతు బిడ్డలేనని రైతులకు పొలాలకు వెళ్లడానికి రహదారి బాగుంటే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రోడ్లకు అవసరమైనన్ని నిధులు ఇస్తానని, కావాలంటే 24 గంటల్లో ప్రొసిడింగ్ అందజేస్తానని పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. గ్రామ సభలు నిర్వహించి రైతుల సహకారం తీసుకొని రోడ్లు పూర్తి చేయాల్సిందిగా చెప్పారు. అదేవిధంగా ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి కుంటల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు.నిధులు కాగితాలకే పరిమితం కాకుండా వాటిని సద్వినియోగం చేసుకొని



ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. లక్ష్య సాధనతో ముందుకు సాగి పనులను దశలవారీగా పూర్తి చేయాల్సిందిగా సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమావేశంలో ఏపిడి నాగవర్ధన్, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార సంకల్పసభను విజయవంతం చేయండి

కడెం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ

కడెం,మన ప్రజాపక్షం:బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అక్టోబర్ 9న ఆదిలాబాద్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్పసభను విజయవంతం చేయాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కడం మండల కేంద్రంలో బహుజన రాజ్యాధికార సంకల్పసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అడ్వకేట్ జగన్ మోహన్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే, ఛత్రపతి శాహూ మహారాజ్, నారాయణ గురు, పెరియార్, డా. బి.ఆర్.అంబేద్కర్, మాన్యవర్ కాన్షీరాం వంటి మహనీయులు సామాజిక సమానత్వం, విద్య, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజనులు ముందుకు సాగాలని అన్నారు.మాన్యవర్ కాన్షీరాం బహుజన సమాజాన్ని రాజకీయంగా సంఘటితం చేయడానికి బామ్సెఫ్,డిఎస్-4వంటి సంస్థలను నిర్మించి, అనంతరం 1984లో బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించి బహుజన రాజ్యాధికార లక్ష్యాన్ని రాజకీయ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లారని తెలిపారు.కాన్షీరాం రాజకీయ వారసత్వాన్ని బహెన్ కుమారి మాయావతి ముందుకు తీసుకెళ్లారని అన్నారు.మాయావతి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారని,మాయావతి ప్రభుత్వ కాలంలో అంబేద్కర్, కాన్షీరాం తదితర మహనీయుల ఆలోచనలు, సామాజిక పరివర్తనకు సంబంధించిన స్మారక స్థలాలు, పార్కులు నిర్మించబడ్డాయని పేర్కొన్నారు. బహుజనుల రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం వంటి అంశాలు బిఎస్పీ రాజకీయ ఉద్యమంలో ముఖ్యమైనవని తెలిపారు.రాజకీయ అధికారం లేకుండా సామాజిక మార్పు సాధించడం కష్టమని,బహుజనులు తమ ఓటు విలువను గుర్తించి రాజకీయంగా చైతన్యవంతులు కావాలని అడ్వకేట్ జగన్ మోహన్ అన్నారు. విద్య, ఉద్యోగాలు, భూమి, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై బహుజనులు ఐక్యంగా తమ హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 9న ఆదిలాబాద్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో జరిగే బహుజన రాజ్యాధికార



సంకల్పసభకు నిర్మల్ జిల్లా నుంచి బహుజనులు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని అడ్వకేట్ జగన్ మోహన్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి యాదవ్,బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు అంకంపేట గంగాదర్,సీనియర్ నాయకులు జోసెఫ్ గంగారాం,బహుజన నాయకులు శైలెందర్,రాజేష్, రవిగౌడ్,ఆర్ల రమేష్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



సోషల్ మీడియాలో సాహసం కోసం ప్రాణాలతో చెలగాటం

ఆకతాయి బాలురను గుర్తించిన సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు

'శిక్ష కాకుండా...సరిదిద్దే ప్రయత్నం' మానవతా దృక్పథంతో కౌన్సెలింగ్

మొదటి తప్పిదంగా భావించి హెచ్చరించిన పోలీసులు

మరోసారి చేస్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్

సూర్యాపేట,మన ప్రజాపక్షం:
సూర్యాపేట పట్టణంలో బైక్‌పై ప్రమాదకరంగా, అసభ్యకరంగా కూర్చొని డ్రైవింగ్ చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేసిన బాలురను సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు.యువతలో కొందరు చేస్తున్న ఇలాంటి ఆకతాయి చేష్టలు తమకే కాకుండా రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు.ఎస్పీ ఆదేశాల మేరకు, టౌన్ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, వెంకట్ రెడ్డి బాలురను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.అయితే కేవలం శిక్షించడం కాకుండా బాలుర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. రహదారులపై ప్రమాదకరంగా బైక్ నడపడం, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ కోసం ప్రాణాలను పణంగా పెట్టడం ఎంతటి ప్రమాదానికి దారితీస్తుందో వారికి వివరించారు.తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సమాజం తమపై పెట్టుకున్న నమ్మకాన్ని గుర్తు చేస్తూ.. చిన్న వయసులో చేసే సరదా చేష్టలు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చని పోలీసులు హెచ్చరించారు. ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు.ఇది మొదటి తప్పిదంగా భావించి మీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అవకాశం ఇస్తున్నాం. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అంటూ పోలీసులు బాలురకు స్పష్టంగా హెచ్చరిక జారీ చేశారు.



అర్జెంటీనా తరఫున తన చివరి మ్యాచ్‌లోనూ మెరిసిన మెస్సీ..

భావోద్వేగాల మధ్య ముగిసిన 21 ఏళ్ల ప్రస్థానం

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది.
అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న లియోనెల్ మెస్సీ తన 21 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు భావోద్వేగాల మధ్య వీడ్కోలు పలికాడు. బ్యూనస్ ఎయిర్స్‌లోని ఎస్టాడియో మాన్యుమెంటల్ మైదానంలో మంగళవారం బెనిన్‌తో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్, మెస్సీకి అర్జెంటీనా జెర్సీలో చివరి మ్యాచ్‌గా నిలిచిపోయింది.సుమారు 85,000 మంది అభిమానుల సమక్షంలో జరిగిన ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా 3-0 తేడాతో ఘన విజయం సాధించింది. 'ది లాస్ట్ టాంగో' పేరుతో నిర్వహించిన ఈ వీడ్కోలు మ్యాచ్‌లోనూ మెస్సీ తన మార్క్ చూపించాడు. ఒక గోల్ సాధించడంతో పాటు మరో రెండు గోల్స్‌కు అసిస్ట్ అందించి తన చివరి మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు.ఈ మ్యాచ్ ఆరంభం నుంచి ముగిసే వరకు మెస్సీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. జట్టు బస్సులో స్టేడియానికి వస్తున్నప్పుడు, మ్యాచ్‌కు ముందు జాతీయ గీతాలాపన సమయంలో, ఆట ముగిసిన తర్వాత కూడా కన్నీటి పర్యంతమయ్యాడు. తన అంతర్జాతీయ కెరీర్‌లో ఇది అత్యంత బాధాకరమైన రోజుల్లో ఒకటని మ్యాచ్ అనంతరం మెస్సీ వ్యాఖ్యానించాడు. "నా జీవితాంతం అర్జెంటీనా కోసం ఆడాలని ఉంది" అంటూ తన దేశం పట్ల ఉన్న ప్రేమను చాటుకున్నాడు. ఈ దృశ్యాలు స్టేడియంలోని అభిమానులను సైతం కదిలించాయి.ఇక, మెస్సీ వీడ్కోలును ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. మ్యాచ్ 10వ నిమిషంలో, మెస్సీ ధరించే ఐకానిక్ నెం.10 జెర్సీకి గౌరవ సూచకంగా స్టేడియం మొత్తం లేచి నిలబడి చప్పట్లతో హోరెత్తించింది. మైదానంలో 'గ్రాసియాస్' (ధన్యవాదాలు) అనే అక్షరాలతో కూడిన భారీ జెర్సీని ప్రదర్శించారు.బాణసంచా వెలుగుల మధ్య ఈ వేడుక అద్భుతంగా సాగింది. 2022 ప్రపంచకప్ గెలిచిన జట్టు సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరై తమ కెప్టెన్‌కు వీడ్కోలు పలికారు. మెస్సీ తన కుమారులతో కలిసి మైదానంలోకి రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అర్జెంటీనా తరఫున ఇది మెస్సీకి రికార్డు స్థాయిలో 208వ మ్యాచ్. ఈ మ్యాచ్‌లోనూ తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. నికోలస్ ఒటమెండికి తొలి గోల్ కోసం అసిస్ట్ అందించిన మెస్సీ, ఆ తర్వాత యువ ఆటగాడు నికో పాజ్‌కు మరో అసిస్ట్ ఇచ్చాడు. ఆట 71వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి, తన అంతర్జాతీయ కెరీర్‌లో 126వ గోల్‌ను నమోదు చేశాడు. 39 ఏళ్ల మెస్సీ నాయకత్వంలోనే అర్జెంటీనా 2022లో ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను గెలుచుకుంది. దీంతో పాటు రెండు కోపా అమెరికా టైటిళ్లను కూడా జట్టుకు అందించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, మెస్సీ క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగుతాడు. అమెరికాకు చెందిన ఇంటర్ మయామి క్లబ్‌తో అతనికి 2028 వరకు ఒప్పందం ఉంది.

ప్రజలు మా ప్రభుత్వానికి అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సూర్యాపేట,మన ప్రజాపక్షం:పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తమ ప్రభుత్వానికి అండగా ఉండేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో నిర్మిస్తున్న సమీకృత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర పౌరసరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అధిక నిధులు, వనరులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశించామని అయితే గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పగించినప్పటికీ పేద ప్రజలకు సన్నబియ్యం అందించలేకపోయిందన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కోటి ఆరు లక్షలకు పైగా పేద ప్రజలకు సన్నబియ్యం అందిస్తోందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని,పేద ప్రజలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగంగా మునగాల మండలంలో అత్యాధునిక సదుపాయాలతో వంటశాలను ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా సంక్షేమం, విద్య, అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో దొరల పాలనలో దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అయన అన్నారు.రూ.200 కోట్ల భారీ వ్యయంతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఇంటర్నేషనల్ పాఠశాలను నిర్మిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.తాము కూర్చున్న ప్రదేశంలో చరిత్ర సృష్టించేలా అత్యున్నత ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక సదుపాయాలతో పాఠశాలను తీర్చిదిద్దుతున్నామని, పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజల సహకారాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి లక్షకు పైగా ఓట్ల మెజార్టీ అందించారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు పర్యాయాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలే తనకు దేవుళ్లని అన్నారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానం కలిగిన నాయకుడని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్, తహశీల్దార్ ప్రవంతి, హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆర్టీసీ బస్టాండ్ లో పసికందును వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

సీడబ్ల్యూసి అధికారులకు అప్పగించిన పాలమూరు పోలీసులు

మహబూబ్ నగర్,మన ప్రజాపక్షం:
మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లిన పసికందును ఆర్టీసీ సిబ్బంది గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఆర్టీసీ సిబ్బంది ఇచ్చిన దరఖాస్తు మేరకు మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఐజాజుద్దీన్ వెంటనే స్పందించి ఆన్‌స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అనంతరం పసికందు సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టి, సంబంధిత సిడబ్ల్యూసీ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. పసికందును వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తుల ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.పసికందును వదిలివెళ్లిన వ్యక్తుల వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి :జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్,మన ప్రజాపక్షం:
సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు అక్టోబర్ 7వ తేదీన నిర్వహించనున్న "సైబర్ జాగృక్త దివస్" కార్యక్రమంలో భాగంగా, అక్టోబర్ నెల మొత్తం జిల్లాలో విస్తృత స్థాయిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.టిజిసిఎస్పి డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేలా నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో "సైబర్ జాగృక్త దివస్"కు సంబంధించిన పోస్టర్లను అధికారికంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలకు అవసరమైన జాగ్రత్తలు, ఆన్‌లైన్ లావాదేవీల భద్రత, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదనే అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.అక్టోబర్ నెలలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, "సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే మనకు రక్షణ" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి రత్నం, డిఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రావణ్ కుమార్, వన్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ వసంత పాల్గొన్నారు.





పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో ఉన్న ఇన్నోవా/బొలెరో వాహనాలను జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ కార్యాలయంలో (డీపీఓ) తనిఖీ చేయడం జరిగింది.దీనిలో భాగంగా వాహనాల యొక్క కండిషన్స్ డ్రైవర్లను అడిగి తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సరి చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. అలాగే ప్రతి డ్రైవర్ కు నెలకి ఒకసారి మెడికల్ కండిషన్ తో పాటు కంటి పరీక్ష చేయించాలని ఎంటిఓ అధికారులకు సూచించారు. ఎవరైనా డ్రైవర్లు అనారోగ్యంగా ఉంటే వారిని తప్పించి కొత్త డ్రైవర్లకు ట్రైనింగ్ ఇచ్చి నియమించుకోవాలని సూచించారు. డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా చూసుకొని,నరైన కండిషన్లో ఉంచుకోవాలని,ఎలాంటి యాక్సిడెంట్లకు తావు లేకుండా జాగ్రత్తగా వాహనాలను డ్రైవింగ్ చేయాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంటిఓ ఆర్ఐ రాఘవరావు,ఆర్ఐ జగన్,ఎస్ బి ఎస్ఐ, శ్రీనివాసులు, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, వాహనాల మెకానిక్ లతో పాటు జిల్లాలో ఉన్న డ్రైవర్లు అందరూ పాల్గొనడం జరిగింది.

552వ ఉర్సు హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ ఖిత్తాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ

వార్షిక ఉర్సు షరీఫ్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

కొల్లశీపల్లిలో అక్టోబర్ 16న 26వ అంతర్‌మత సదస్సు

నారాయణపేట,మన ప్రజాపక్షం:
నారాయణపేట జిల్లా కొల్లశీపల్లిలో నిర్వహించనున్న వార్షిక 552వ ఉర్సు షరీఫ్ హజ్రత్ మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా అహ్మద్ ఖత్తాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ (రహ.) ఉర్సుకు సంబంధించిన పోస్టర్లను నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.552వ ఉర్సు షరీఫ్ సందర్భంగా అక్టోబర్ 16వ తేది శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొల్లంపల్లి దర్గా షరీఫ్ ప్రాంగణంలో 26వ అంతర్ మత సదస్సు నిర్వహించనున్నట్లు అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ, కొల్లశీపల్లి ఉపాధ్యక్షులు అడ్వకేట్ అబ్దుల్ సలీం తెలిపారు.ఈ సదస్సులో గోగీ షరీఫ్ బార్గాహ్ జలాలియా సజ్జదానషీన్ సయ్యద్ షా కలీముల్లాహ్ హుస్సేనీ అధ్యక్షత వహించనున్నారు.అంతర్‌మత సదస్సుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపి డీకే అరుణ,ఎమ్మెల్సీ ఎన్.నవీన్ కుమార్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కోత్వాల్,జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక,జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో పాటు మతదీషులు వివిధ పార్టీ రాజకీయ నాయకులు , సంతులు, మషాయిఖ్‌లు, ఉలమాలు పాల్గొననున్నారు. నమాజ్-ఎ-అసర్ అనంతరం బార్గాహ్ ఖత్తాలియా (రహ.)లో రస్మ్-ఎ-పర్చమ్ కుషాయా (పర్చమ్ జలాలియా) కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ఉలమాలు, మషాయిఖ్‌లు పాల్గొంటారు. నమాజ్-ఎ-మగ్రిబ్ అనంతరం లంగర్ ఖత్తాలియా ఏర్పాటు చేయనున్నారు.అక్టోబర్ 17, శనివారం నమాజ్-ఎ-ఫజర్ అనంతరం ఖాన్కాహ్ ఖత్తాలియా నుంచి సందల్ ఊరేగింపు ప్రారంభమై దర్గా షరీఫ్‌కు చేరుకుంటుంది. అక్కడ సజ్జాదానషీన్, హజ్రత్ చందా హుస్సేనీ (రహ.) మనవడు మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ చేతుల మీదుగా రస్మ్-ఎ-సందల్ నిర్వహించబడుతుంది.నమాజ్-ఎ-ఇషా అనంతరం దర్గా ప్రాంగణంలో చిరాగాన్ మరియు మహ్ఫిల్-ఎ-సమా నిర్వహించనున్నారు.అక్టోబర్ 18, ఆదివారం ఉదయం 8 గంటలకు మహ్ఫిల్-ఎ-కుల్ మరియు తబర్రుకాత్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించబడతాయి.ఉర్సు షరీఫ్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు 552వ ఉర్సు ముబారక్‌లో అష్రఫీయా జలాలియా సిల్సిలాకు చెందిన కొల్లశీపల్లి అనుబంధితులు,భక్తులు,హిందు,ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అడ్వకేట్ అబ్దుల్ సలీం, అడ్వకేట్ అమీరుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ తఖీ చాంద్, దస్తగీర్ చాంద్, సయ్యద్ ఆరిఫ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

కల్వకుర్తి,మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు కల్వకుర్తి పట్టణంలోని సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాల నందు షీ టీం బృందం ఆధ్వర్యంలో ఈవిటీజింగ్, పోక్సో చట్టం, ఉమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు వంటి వాటి గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.మహిళలు, బాలికల భద్రత కోసం తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం (షి టీం). మహిళలపై జరిగే ఈవ్ టీజింగ్, వేధింపులు, స్టాకింగ్, సైబర్ వేధింపులు వంటి నేరాలను నివారించడం దీని ప్రధాన లక్ష్యం.ఫిర్యాదులను స్వీకరించడం బాధితులకు కౌన్సెలింగ్ అందించడం, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మహిళల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తుంది. సమాజంలో మహిళలు నిర్భయంగా జీవించేందుకు షీ టీమ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి, విలువలతో కూడిన జీవనవిధానంతో, క్రమశిక్షణతో కృషి చేయడం వలన ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ పేరు మీద మా యాప్ లో లోన్ వచ్చిందని లేదా మీకు క్యూఆర్ కోడ్ పంపించి దానిని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్పిన యెడల నమ్మకండి. అది సైబర్ మోసం అని తెలుసుకోండి. సైబర్ నేరాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఇంటర్నెట్లో ఓటీపీ నంబర్ గానీ, బ్యాంక్/ఏటిఎం కార్డ్ నంబర్ గానీ ఎవరికీ పంపవద్దని, ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు జరగుతున్నాయని, ఎవరూ బాల్య వివాహాలు చేసుకోవద్దని, ఎవరైనా అలా చేయాలని ప్రయత్నించినచో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు ఫోన్ చేయాలని కోరారు. మైనర్లు, లైసెన్సు లేనివారు, మద్యం తాగినవారు ఎలాంటి వాహనం నడపకూడదని, రోడ్డు ప్రమాదాల వలన అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాటిని మనందరం నివారించేందుకు కృషి చేద్దామని తెలిపారు.వివిధ రకాల మాయమాటలు చెప్పి పిల్లలను, అమ్మాయిలను, మహిళలను అక్రమ రవాణా చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాంటి అనుమానితులు ఉంటే వెంటనే సంబంధిత పోలీసులకు 8712657745 కు డయల్ 112 లేదా షీ టీం 8712657676 కు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు.





కస్తూర్బా పాఠశాలలో మౌలిక
వసతులు,విద్యార్థుల సౌకర్యాలపై కలెక్టర్ పరిశీలన

దామరగిద్ద కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ప్రియాంక





నారాయణపేట,మన ప్రజాపక్షం:దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల/కళాశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదుల భవనాన్ని పరిశీలించిన ఆమె, నిర్మాణ పనులు తుది దశలో ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులను ఫోన్ ద్వారా ఆదేశించారు.పాఠశాల ఆవరణలో ఫర్నిచర్ నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత భవనంలో పాఠశాల, కళాశాల తరగతుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఓ స్వాతి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నూతన భవనంలోని కింది అంతస్తులో ఉన్న అదనపు గదులను తరగతుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. ఉన్నత విద్యలో ఏ కోర్సులు చదవాలనుకుంటున్నారని ప్రశ్నించగా, విద్యార్థినులు న్యాయ విద్యను అభ్యసించాలని ఉందని తెలిపారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి కనీసం డిగ్రీ వరకు విద్యను కొనసాగించాలని, ఉన్నత విద్యతో పాటు భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.వొకేషనల్ తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, వారి భవిష్యత్ విద్యా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. బీఎస్సీ నర్సింగ్ చదవాలనుకుంటున్నామని విద్యార్థినులు తెలపగా, జిల్లా కేంద్రంలో నర్సింగ్ కళాశాల అందుబాటులోకి రానుందని, విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినుల వద్దకు వెళ్లిన కలెక్టర్, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. మెస్ కమిటీ విద్యార్థినులతో మాట్లాడి కూరగాయలు, నిత్యావసర సరుకుల నాణ్యత, భోజన నిర్వహణను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిత్యావసర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. మెనూ బోర్డును చూశారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.డైనింగ్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, పక్షులు లోపలికి రాకుండా షెడ్ ఎత్తును పెంచి అవసరమైన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఓను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానేష్ కుమార్ ను అరెస్టు చేసి.. విచారించాలి

ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి డిమాండ్

ఢిల్లీలో సేవ్ డెమోక్రసీ ఆందోళనలో తెలంగాణ ఎంపీలతో కలిసి పాల్గొని నినదించిన రామసహాయం

ఖమ్మం,మన ప్రజాపక్షం:
ఓటు చోరీకి సహకరించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్టు చేసి విచారించాలనే డిమాండ్ తో సేవ్ డెమోక్రసీ పేరుతో ఢిల్లీలో మంగళవారం ఈసీ కార్యాలయానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంకతో పాటు విపక్ష ఎంపీలు ర్యాలీ నిర్వహించగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పాల్గొన్నారు. మకరద్వార్ నుంచి నిర్వాచన్ సదన్ వరకు ర్యాలీలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు.ఇండియా కూటమి ఎంపీల ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఫారమ్-6, ఫారమ్-7 దరఖాస్తుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఓట్లు దొంగలించిన సీఈసీ, ప్రధానమంత్రి దిగిపోవాల్సిందేనని డిమాండ్ చేశారు.

పోలేరమ్మజాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు,మన ప్రజాపక్షం: పొదలకూరు మండల కేంద్రంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న గ్రామదేవత పోలేరమ్మ తల్లి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జాతర నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాతరలో మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాలు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై జాతర కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలేరమ్మ జాతరకు సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీరు తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, కోవూరు బక్కయ్య నాయుడు, వివిధ శాఖల అధికారులు, పోలేరమ్మ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





గ్రామాల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట నియోజకవర్గంలోఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధికారులను కోరారు.అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు,ఏపీవోలు,సాంకేతిక సహాయకులు,ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు.గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన పనులను గుర్తించి,ప్రజలకు ఎక్కువగా ఉపాధి లభించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచే విధంగా పనుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా
లఘుచిత్రం, ఫోటోగ్రఫీ పోటీలు

గద్వాల,మన ప్రజాపక్షం:జోగులాంబ గద్వాల జిల్లాలో పోలీస్ ఫ్లాగ్ డే (అమరవీరుల స్మారక వారోత్సవాలు) 21 అక్టోబర్ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 3 నిమిషాల లఘుచిత్రం (షార్ట్ ఫిల్మ్) మరియు ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనే ఆసక్తి ఉన్న ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు మరియు సృజనాత్మక ప్రతిభ కలిగిన వారు పోలీస్ శాఖ విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీస్-ప్రజల స్నేహపూర్వక సంబంధాలు, అమరవీరుల త్యాగాలు, మహిళలు మరియు పిల్లల భద్రత, ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత, నేర నియంత్రణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు తదితర పోలీస్ శాఖకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించేలా లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలను రూపొందించవచ్చని ఎస్పీ తెలిపారు.లఘుచిత్రం గరిష్టంగా 3 నిమిషాల నిడివితో ఉండాలని, ఫోటోగ్రఫీ పోటీలో ఇటీవల తీసిన పోలీస్ శాఖకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించే ఉత్తమ ఛాయాచిత్రాలను సమర్పించాలని సూచించారు.పోటీలలో పాల్గొనదలచిన వారు తమ లఘుచిత్రాలు మరియు ఛాయాచిత్రాలను 23.10.2026 లోపు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పిఆర్ఓ నవీన్ ఫోన్ నెంబర్ 8712661828కు అందజేయాలని ఎస్పీ తెలిపారు.జిల్లా స్థాయిలో న్యాయనిర్ణేతల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు లఘుచిత్రాలు మరియు మూడు ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేసి, విజేతలకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో ఎంపికైన టాప్-3 లఘుచిత్రాలు మరియు ఛాయాచిత్రాలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎస్పీ గారు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ప్రతిభా పత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.పోలీస్ శాఖ సేవలను, అమరవీరుల త్యాగాలను, సమాజ భద్రత కోసం పోలీసులు చేస్తున్న కృషిని సృజనాత్మకంగా ప్రజలకు చేరువ చేసే ఈ అవకాశాన్ని ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు కోరారు.





పొదలకూరు పోలేరమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు...
200 మందికి పైగా పోలీసులు

పొదలకూరు,మన ప్రజాపక్షం:
పొదలకూరు పట్టణంలోని శ్రీ పోలేరమ్మ తల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ప్రతిష్టాత్మక ఏర్పాట్లు చేశారు. దశాబ్దాల తర్వాత జాతరను ఘనంగా నిర్వహించుకుంటుండటం సంతోషంగా ఉందని ఎస్ఐ శివరాకేష్ తెలిపారు. మంగళవారం ప్రారంభమైన జాతర మహోత్సవం గురువారం సాయంత్రం వరకు కొనసాగనుంది.జాతరలో ప్రధానమైన గురువారం రోజున 45 వేల నుంచి 60 వేల మంది వరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 200 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. క్యూలైన్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా కొనసాగించనున్నట్లు చెప్పారు.భక్తుల రద్దీ దృష్ట్యా గురువారం మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ మళ్లింపు చేపట్టనున్నట్లు తెలిపారు. చాటగొట్ల నుంచి బిరదవోలు వైపు వాహనాలను మళ్లించడంతో పాటు గేట్ సెంటర్ నుంచి నెల్లూరు వెళ్లే వాహనాలను చిట్టెపల్లి మీదుగా సంగం రోడ్డుకు మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఐదు ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జాతరలో పిక్‌పాకెట్లు, ఆకతాయిలు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివరాకేష్ హెచ్చరించారు. శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

అంతరిక్షంలోకి విస్కీ..
2028లో జరగబోయే ప్రయోగం ఇదే..!

విస్కీని సాధారణంగా ఓక్ పీపాల్లో ఏళ్ల తరబడి నిల్వ చేస్తారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు అంతరిక్షంలో విస్కీని 'ఏజ్' చేయాలని సిద్ధమవుతున్నారు. భూమికి దూరంగా, గురుత్వాకర్షణ దాదాపు లేని పరిస్థితుల్లో విస్కీ ఎలా మారుతుందో తెలుసుకునేందుకు ఈ ప్రయోగం చేపట్టనున్నారు.స్కాట్లాండ్, జపాన్‌కు చెందిన ఇంజినీర్లు కలిసి ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. 'స్పేస్ పఫిన్'గా పిలుస్తున్న ఈ ప్రయోగాన్ని 2028లో చేపట్టాలని నిర్ణయించారు. చిన్న ఉపగ్రహం క్యూబ్‌సాట్‌లో విస్కీ నమూనాలు, ముడి పదార్థాలను అంతరిక్షంలోకి పంపనున్నారు.

పీపాలకు బదులు ఓక్ ముక్కలు

సాధారణ ఓక్ పీపాలు చాలా బరువుగా, పెద్దగా ఉంటాయి. వాటిని ఉపగ్రహంలో తీసుకెళ్లడం సాధ్యం కాదు. దీంతో శాస్త్రవేత్తలు ప్రత్యేక మైక్రో కంటెయినర్లను రూపొందించారు. విస్కీని ఓక్ చెక్క ముక్కల్లో ఉంచి పీపాలో జరిగే ఏజింగ్ ప్రక్రియను చిన్న స్థాయిలో అనుకరించనున్నారు.

జీరో గ్రావిటీలో ఏం జరుగుతుంది?

అంతరిక్షంలో విస్కీలో జరిగే రసాయన మార్పులను పరిశీలించనున్నారు. ద్రవాల కదలిక, హీట్ ట్రాన్స్‌ఫర్‌పై గురుత్వాకర్షణ ప్రభావం ఎలా ఉంటుందో సెన్సర్ల ద్వారా గుర్తిస్తారు. భూమితో పోలిస్తే అంతరిక్షంలో ఓక్ చెక్క భిన్నంగా వ్యవహరించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీంతో విస్కీ ఏజింగ్ ప్రక్రియ వేగంగా జరిగే అవకాశముంది..





2027 ప్రపంచకప్‌కు భారీ డిమాండ్.. లక్షల్లో టికెట్ దరఖాస్తులు

2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్‌పై అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. టికెట్ బ్యాలెట్ ప్రారంభమైన మూడు రోజుల్లోనే పది లక్షలకు పైగా దరఖాస్తులు వెల్లువెత్తడం ఈ మెగా టోర్నీ క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ క్రీడా సంబరానికి ప్రపంచవ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తోంది.ఐసీసీ మంగళవారం వెల్లడించిన గణాంకాల ప్రకారం, ఇప్పటికే 3.2 లక్షల మంది అభిమానులు రిజిస్టర్ చేసుకోగా, మొత్తం 11 లక్షల టికెట్ల కోసం దరఖాస్తులు అందాయి. ఎప్పటిలాగే భారత్-పాకిస్థాన్ పోరుకు అత్యధికంగా 1.10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత భారత్-దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు 92,000, భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌కు 86,000 దరఖాస్తులు వెల్లువెత్తాయి. నవంబర్ 21న జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం కూడా సుమారు 69,000 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.ఈ భారీ స్పందనపై ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా స్పందిస్తూ, "కేవలం 48 గంటల్లోనే 10 లక్షల టికెట్ దరఖాస్తులు రావడం ప్రపంచకప్‌కున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఆఫ్రికా ఖండంలో ఈ టోర్నీ నిర్వహిస్తుండటం ఆఫ్రికా సత్తాను ప్రపంచానికి చాటేందుకు ఒక చక్కని తరుణం" అని పేర్కొన్నారు.స్థానిక ఆర్గనైజింగ్ కమిటీ సీఈఓ ఖొండిసా ఎంగ్వెన్యా మాట్లాడుతూ, ఈ స్థాయి స్పందన టోర్నీపై నెలకొన్న ఆసక్తికి నిదర్శనమని అభివర్ణించారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సాదర స్వాగతం పలుకుతున్నాయి. మా ప్రాంతీయ సంస్కృతిని, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ఆయన తెలిపారు. కాగా, 2027 ప్రపంచకప్ టికెట్ల కోసం ఆసక్తి గల అభిమానులు నవంబర్ 21 వరకు టికెట్ బ్యాలెట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.



తమిళనాడు సీఎం విజయ్‌ను కలిసిన టీడీపీ ఎంపీలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను తెలుగుదేశం పార్టీ ఎంపీల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. విజయవాడలో నిర్వహించనున్న 'విజయవాడ ఉత్సవ్'కు ఆయనను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ విషయాన్ని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు.లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలోని ఈ బృందంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కేశినేని శివనాథ్, జి.ఎం.సి. హరీశ్ బాలయోగిలతో పాటు విజయవాడ ఉత్సవ్ కమిటీ ఛైర్మన్ కె. మురళి ఉన్నారు. ఈ భేటీ ఎంతో ఆత్మీయంగా, చిరస్మరణీయంగా జరిగిందని శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సీఎం విజయ్ చూపిన వినయం, ఆప్యాయత, సౌజన్యం తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.తెలుగు, తమిళ ప్రజల మధ్య సరిహద్దులకు అతీతమైన సాంస్కృతిక, కళా, సినీ, సంప్రదాయ బంధం ఉందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఈ స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు 'విజయవాడ ఉత్సవ్' ఒక అద్భుతమైన వేదిక అని ఆయన వివరించారు. ఈ వేడుక కోసం విజయ్‌ను విజయవాడకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని, ఆయన రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

అధికారినిని అంటూ వల..

ఆప్ నేతను పెళ్లాడి నగలతో ఉడాయించిన మహిళ!

పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత ఒకరు పెళ్లి పేరుతో భారీ మోసానికి గురయ్యారు. తాను పంజాబ్ సివిల్ సర్వీసెస్ (పీసీఎస్) అధికారిణినని నమ్మించిన ఒక మహిళ, ఆయన్ను వివాహం చేసుకుని బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులతో పరారైంది. ఈ ఘటన ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలో వెలుగుచూసింది.వివరాల్లోకి వెళితే.. ఆప్ జిల్లా సంయుక్త కార్యదర్శి, జిల్లా పరిషత్ సభ్యుడు అమరీందర్ సింగ్ మండోఫల్, ఈ ఏడాది ఫిబ్రవరిలో మన్‌విందర్ కౌర్ అనే మహిళను వివాహం చేసుకున్నారు. ఈ వివాహ వేడుకకు పంజాబ్ అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్, క్యాబినెట్ మంత్రి తరుణ్‌ప్రీత్ సింగ్ సౌంధ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు.అయితే, వివాహమైన కొద్ది రోజులకే మన్‌విందర్ కౌర్ ఇంట్లోని నగలు, విలువైన వస్తువులతో అదృశ్యమైంది. తాను మోసపోయానని గుర్తించిన అమరీందర్ సింగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. మన్‌విందర్, ఆమె కుటుంబ సభ్యులు.. ఆమెను పెళ్లికాని పీసీఎస్ అధికారిణిగా పరిచయం చేశారని, వయసు విషయంలోనూ తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పెళ్లి అనంతరం ఆమెకు ఇప్పటికే విడాకులయ్యాయని, 18 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడని, అసలు ఆమెకు ప్రభుత్వ ఉద్యోగమే లేదని తెలిసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వయసు తక్కువగా చూపించేందుకు పత్రాలను సైతం తారుమారు చేశారని ఆయన ఆరోపించారు.అమరీందర్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మన్‌విందర్ కౌర్‌తో పాటు ఆమె సోదరుడు, తల్లి, ఇతర బంధువులతో కలిపి మొత్తం ఆరుగురిపై మోసం, ఫోర్జరీ కేసులు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు ప్రస్తుతం లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు: దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక

ఇరు కొరియాల మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. తమ భూభాగంలోకి ఒక్క మిల్లీమీటర్ అడుగుపెట్టినా తక్షణమే, అత్యంత శక్తిమంతంగా ప్రతిఘటిస్తామని ఉత్తర కొరియా మంగళవారం దక్షిణ కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. సరిహద్దులో ఇటీవల జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడు ఘటనపై దక్షిణ కొరియా తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 21న ఇరు దేశాల సరిహద్దులోని సైనిక రహిత ప్రాంతం దక్షిణ భాగంలో జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఇద్దరు దక్షిణ కొరియా సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియానే కారణమని, వారు ఉద్దేశపూర్వకంగానే మైన్‌లను అమర్చారని దక్షిణ కొరియా సైన్యం దర్యాప్తులో పేర్కొంది. దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితి కమాండ్ సహకారంతో దక్షిణ కొరియా ఆ ప్రాంతంలో మైన్‌లను తొలగించే ఆపరేషన్‌ను చేపట్టింది. దీన్ని ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తీసుకున్న



నిర్ణయాత్మక చర్యగా దక్షిణ కొరియా రక్షణ మంత్రి కాంగ్ షిన్-చుల్ అభివర్ణించారు.ఈ పరిణామాలపై ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ల్యాండ్‌మైన్ పేలుడుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ మేరకు ఆరోపణలను పూర్తిగా ఖండించింది. దక్షిణ కొరియా ఉద్దేశపూర్వకంగా కట్టుకథ అల్లి, తమపై నిందలు వేస్తోందని, అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. "ఒకవేళ దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు రేఖను దాటి మా భూభాగంలోకి ప్రవేశిస్తే, మా సరిహద్దు దళాలు తక్షణమే శక్తిమంతమైన ప్రతిచర్య తీసుకుంటాయి" అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.ఈ వివాదానికి ప్రధాన కారణం సరిహద్దు రేఖ పై స్పష్టత లేకపోవడమేనని వాదనలు వినిపిస్తున్నాయి. 1953 యుద్ధ విరమణ ఒప్పందం సమయంలో ఏర్పాటు చేసిన 1,292 సరిహద్దు గుర్తింపు చిహ్నాలలో చాలా వరకు కాలక్రమేణా దెబ్బతినడంతో, ప్రస్తుతం కేవలం 200 మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రేఖపై నెలకొన్న అనిశ్చితిని పరిష్కరించడానికి చర్చలు జరపాలని దక్షిణ కొరియా ప్రతిపాదించినప్పటికీ, అందుకు తాము సిద్ధంగా లేమని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో చర్చలకు తావులేదని, బల ప్రయోగంతోనే తమ భూభాగాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక.. ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని



మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. "జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు.భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు.దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99



రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.అంతర్జాతీయంగా చూస్తే, సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 ఏళ్లు నిరంతరాయంగా అధికారంలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో సుదీర్ఘ పాలనకు ఆయనను ఒక ఆధునిక కొలమానంగా పరిగణిస్తారు. ఆయన నాయకత్వంలో సింగపూర్ పేదరికం నుంచి ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేసి, ఆధునిక ప్రపంచంలో ఎక్కువ కాలం పనిచేసిన నేతల్లో ఒకరిగా నిలిచారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పోటీతత్వ ప్రజాస్వామ్యంలో వరుస ఎన్నికల విజయాలతో ఈ 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం మోదీ విషయంలో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది. "వికసిత భారత్" లక్ష్యంతో ఆయన ప్రస్థానం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు వివాదాస్పద పాలకులుగా ముద్రపడగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికవుతూ మోదీ ఈ ఘనత సాధించడం గమనార్హం.

కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు.. కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్


హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ గతంలో ప్రతిపాదించిన బహుళ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో సరికొత్తగా డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుంది.సవరించిన ప్రణాళిక ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫఖంజా కాలేజీ వరకు ఆరు లేన్ల స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి) నిర్మించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1 వైపు వెళ్లేందుకు వీలుగా దీనికి ఒక ర్యాంప్‌ను కూడా అనుసంధానిస్తారు. గతంలో ఈ పనులకు సంబంధించి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన 'లెటర్ ఆఫ్ అవార్డు'ను ఉపసంహరించుకుని, కొత్త డిజైన్ బాధ్యతలను



మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించారు. భూసేకరణ వ్యయం తగ్గడం వల రూ. 800 కోట్లు, నిర్మాణ ఖర్చు తగ్గడం వల్ల మరో రూ. 400 కోట్లు కలిపి మొత్తం రూ. 1200 కోట్లు ఆదా అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ ప్రాజెక్టుపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ గతంలో తలపెట్టిన హెచ్-సిటీ పనులను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వన్-వే విధానం సత్ఫలితాలను ఇస్తుండటంతో దానినే శాశ్వతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం ఆదా అవుతుందని, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించి, వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్ల నరికివేతపై కోర్టు ఆంక్షల కారణంగా పాత ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. మాదాపూర్, హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు సిగ్నల్-ఫ్రీ ప్రయాణాన్ని కల్పిస్తూనే, పార్క్‌లోని పచ్చదనానికి కనీస నష్టం కలగకుండా ఈ సరికొత్త కారిడార్‌ను ప్రభుత్వం రూపొందించింది.

ప్యారిస్‌లో చీరకట్టుతో జాన్వీ..అందరి చూపు ఆ జ్యూయలరీ బ్లౌజ్‌పైనే!

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరినీ అబ్బురపరిచారు. ప్యారిస్‌లో జరిగిన ఓ గాలా ఈవెంట్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన చీరకట్టు ఇప్పుడు అంతర్జాతీయ ఫ్యాషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారతీయ హస్తకళకు ఆధునిక సొబగులు అద్దిన ఈ లుక్‌తో జాన్వీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమానికి జాన్వీ న్యూఢిల్లీకి చెందిన 'పంకజ్ ఎస్. హెరిటేజ్' లేబుల్ డిజైన్ చేసిన చీరను ఎంచుకున్నారు. సహజమైన ఐవరీ రంగులో ఉన్న ఈ చీరను చారిత్రక ప్రాధాన్యమున్న 460-కౌంట్ బెంగాల్ మస్లిన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారు. మొఘలుల కాలంలో ఢాకా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఈ వస్త్రాన్ని 'బాఫ్ట్ హవా' (నేసిన గాలి) అని పిలిచేవారు. అంతటి సున్నితమైన చీరపై తెల్లటి చికంకారీ ఎంబ్రాయిడరీ అదనపు అందాన్ని తెచ్చిపెట్టింది.అయితే, ఈ చీరకట్టులో అసలైన హైలైట్ ఆమె ధరించిన బ్లౌజ్. ఈ బ్లౌజ్ స్లీవ్స్‌ను పోల్కీలు, గార్నెట్‌లు, పచ్చలతో దట్టంగా పాదిగారు. ఈ స్లీవ్స్ భుజాలపై నుంచి జాలువారుతున్న ఆభరణాల్లా కనిపించడంతో జాన్వీ మెడలో ఎలాంటి నెక్లెస్ ధరించకుండానే సంపూర్ణమైన లుక్‌ను సాధించారు. దీనికి తగ్గట్టుగా కోల్‌కతాకు చెందిన 'విర్రాయా జ్యూయలరీ' చెవిపోగులు, కఫ్‌లతో పాటు స్లీవ్స్‌కు మ్యాచింగ్ అయ్యేలా పచ్చలు పాదిగిన ఉంగరాన్ని ధరించారు.మేకప్ ఆర్టిస్ట్ నోరా కౌర్కిస్ అందించిన సాఫ్ట్ గ్లామ్ మేకప్, స్లీక్ బన్ హెయిర్‌స్టైల్ ఈ లుక్‌ను మరింత ఉన్నతంగా నిలబెట్టాయి. మొత్తం మీద, జాన్వీ కపూర్ లుక్ భారతీయ వారసత్వ హస్తకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన వారధిలా నిలిచిందని ఫ్యాషన్ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.



శతక శ్రేయస్..తొలి టీ20లో విండీస్‌పై భారత్ ఘన విజయం



లక్నో: ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన జోష్‌లో ఉన్న టీమిండియా సొంతగడ్డపై వెస్టిండీస్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఘనవిజయంతో ఆరంభించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 102 నాటౌట్) అజేయ శతకంతో రెచ్చిపోయిన వేళ మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. ఆ జట్టు నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యాన్ని భారత్ 14.4 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అయ్యర్‌కు ఇషాన్ కిషన్ (37 నాటౌట్) అండగా నిలిచాడు. తొలుత విండీస్ 19.1 ఓవర్లలో 171 రన్స్‌కు ఆలౌట్ అయింది. రూథర్‌ఫర్డ్ (34 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 56), కెప్టెన్ షై హోప్ (37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52) అర్ధ శతకాలతో రాణించారు. అరంగేట్ర బౌలర్ నమన్ ధీర్ (3/31),అక్షర్ (2/26), కుల్‌దీప్ (2/33) సత్తా చాటారు. శుక్రవారం రాంచీలో రెండో టీ20 జరగనుంది.

సర్ఫంచ్ సాబ్‌దే ఆట

మోస్తరు ఛేదనలో 35 పరుగులకే ఓపెనర్లను కోల్పోయినా కెప్టెన్ శ్రేయస్ ధనాధన్ మెరుపులు మెరిపించడంతో టీమిండియా విజయం నల్లేరుపై నడకే అయింది. వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్ ఇషాన్‌తో కలిసి కరీబియన్ బౌలర్లపై సర్ఫంచ్ సాబ్ పిడుగులా విరుచుకుపడ్డాడు. ఛేదనలో మొదటి ఓవర్లోనే 6, 4, 4తో రెచ్చిపోయిన అభిషేక్ (21)ను ఛేజ్ ఔట్ చేసి ఆ జట్టుకు తొలిబ్రేక్ ఇచ్చాడు. ఆ వెంటనే శాంసన్ (11).. అకీల్ బౌలింగ్‌లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దాంతో ఇషాన్‌కు జతకలిసిన అయ్యర్ మొదట్నుంచే దంచుడు మంత్రాన్ని జపించాడు. షమార్ జోసెఫ్ ఆరో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో బాదుడుకు శ్రీకారం చుట్టిన అతడు.. ఆ తర్వాతా ఎక్కడా తగ్గలేదు. ఇషాన్ అతడికి పూర్తి సహకారమందిస్తూ స్ట్రైక్‌ను రొటేట్ చేశాడు.షెఫర్డ్ 9వ ఓవర్లోనూ శ్రేయస్ మరోసారి హ్యాట్రిక్ ఫోర్లతో అలరించాడు. 28 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన సారథి ఆ తర్వాత విధ్వంసాన్ని తారాస్థాయికి చేర్చాడు. ఫోర్డె విసిరిన 14వ ఓవర్లో మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో 24 రన్స్ రాబట్టి 90ల్లోకి వచ్చాడు. ఛేజ్ 15వ ఓవర్లో మూడో బంతిని లాంగాన్ మీదుగా భారీ సిక్స్ బాది తన కెరీర్‌లో తొలి టీ20 శతకాన్ని నమోదుచేశాడు. 42 బంతుల్లోనే అతడి సెంచరీ సాధించగా ఆ తర్వాత సింగిల్‌తో భారత గెలుపు లాంఛనమూ పూర్తయింది.

బాది.. ఆగి.. మళ్లీ బాది

ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించిన విండీస్ ఆ తర్వాత తడబాటుకు గురై క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినా మళ్లీ ఆఖర్లో మెరుపులతో ప్రత్యర్థి ఎదుట పోరాడగలిగే స్కోరును నిలుపగలిగింది. మొదట్లో కెప్టెన్ హోప్ బౌండరీలతో భారత బౌలర్లపై విరుచుకుపడితే ఆఖర్లో రూథర్‌ఫర్డ్ మెరపులు మెరిపించాడు.ఫోర్‌తోనే వేట మొదలెట్టిన హోప్, మయాంక్ వేసిన రెండో ఓవర్లో నాలుగుసార్లు బంతిని బౌండరీ లైన్ దాటించాడు. అర్ష్‌దీప్ విసిరిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ఆఫ్‌స్టంప్‌నకు ఆవలగా వెళు ్తన్న బంతిని ఆడబోయిన ఓపెనర్ కమిల్ పూరన్ (12) ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో క్లీన్‌బౌల్డ్ అవడంతో విండీస్ తొలి వికెట్ కోల్పోయింది.ఆ వెంటనే అక్షర్ ఓవర్లో రెండో బంతికి హెట్‌మయర్ (5) రనౌట్ అవడమే గాక ఐదో బంతికి పావెల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కరీబియన్ జట్టు 44/3తో పవర్ ప్లేను ముగించింది. తర్వాత ఆ జట్టు స్కోరు వేగం కూడా నెమ్మదించింది. నమన్ వేసిన రెండో ఓవర్లో సిక్స్‌తో అర్ధ శతకాన్ని పూర్తిచేసిన హోప్.. అదే ఓవర్లో అక్షర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో కుల్‌దీప్.. ఛేజ్ (5), ఫోర్డె (2)ను పెవిలియన్‌కు పంపగా రొమారియా (7), ట్రింగర్ (9)ను నమన్ ఔట్ చేశాడు. ఒకవైపు సహచర బ్యాటర్లంతా విఫలమవుతున్నా రూథర్‌ఫర్డ్ మాత్రం నిలబడ్డాడు. మయాంక్ 17వ ఓవర్‌లో రెండు ఫోర్లతో జూలు విదిల్చిన అతడు.. 31 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. కానీ మయాంక్ 19వ ఓవర్లో నమన్‌కు క్యాచ్ ఇచ్చి తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 19.1 ఓవర్లకు 171 ఆలౌట్ (రూథర్‌ఫర్డ్ 56, హోప్ 52, నమన్ 3/31, అక్షర్ 2/26);
భారత్: 14.4 ఓవర్లకు 172/2 (శ్రేయస్ 102ఐ, ఇషాన్ 37, ఛేజ్ 1/37, అకీల్ 1/37)

SPORTS

ఇక మంధాన శకం..
భారత కెప్టెన్‌గా తప్పుకున్న హర్మన్



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టులో విజయవంతమైన కెప్టెన్‌గా పేరొందిన హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోగా.. ఆమె స్థానంలో కొత్త సారథిగా స్మృతి మంధానను బీసీసీఐ ఎంపిక చేసింది. మంగళవారం గువాహటిలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం తర్వాత హర్మన్ తన నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ద్వారా వెల్లడించింది. ఈ సమావేశంలో హెడ్ కోచ్ అమోల్ మజుందార్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కూడా పాల్గొన్నారు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్నా ఆటపై తనకున్న ప్రేమ తగ్గబోదని, ఇకపై ఓ ప్లేయర్‌గా అన్ని ఫార్మాట్లలో కొనసాగుతానని కౌర్ స్పష్టం చేసింది.'కెప్టెన్‌గా నా బాధ్యత ముగిసింది. జట్టు కోసం నా శక్తినంతటినీ ధారపోశాను. నా వ్యక్తిగత రికార్డులు, లక్ష్యాలను పక్కన పెట్టి ఎల్లప్పుడూ జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చాను. కెప్టెన్సీ ముగిసినంత మాత్రాన భారత క్రికెట్ పట్ల నాకున్న ప్రేమ తగ్గదు. కేవలం ఆటపై ఉన్న మక్కువతో మైదానంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాను' అని భావోద్వేగంగా రాసుకొచ్చింది. 2016లో టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన హర్మన్‌ప్రీత్, 2022లో వన్డేలకు, 2023లో అన్ని ఫార్మాట్లకు సారథిగా ఎంపికైంది. ఆమె నాయకత్వంలోనే గతేడాది తొలిసారి వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన భారత్ వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలిచింది. మొత్తంగా హర్మన్ 5 టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20 మ్యాచ్‌ల్లో భారత జట్టుకు నాయకత్వం వహించింది.అయితే కొంతకాలంగా తను బ్యాటర్‌గా తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఇటీవలి టీ20 ప్రపంచ కప్‌లో భారత్ కనీసం సెమీఫైనల్ చేరలేకపోవడంతో ఆమెపై విమర్శలు వచ్చాయి.

షెఫాలీ, దీప్తికి వైస్ కెప్టెన్సీ..

హర్మన్ తప్పుకోవడంతో ఊహించినట్టుగానే వైస్ కెప్టెన్ మంధానకే సారథ్య బాధ్యతలు దక్కాయి. డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ జట్టును రెండు సార్లు విజేతగా నిలిపిన మంధాన ఇప్పటికే తన నాయకత్వ ప్రతిభను నిరూపించుకుంది. దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం చాలా ప్రత్యేకమైన గౌరవమని మంధాన చెప్పింది. స్వదేశంలో ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో మంధాన కెప్టెన్సీలో భారత్ బరిలోకి దిగనుంది. రెండు సిరీస్‌ల్లో పాల్గొనే జట్లనుఎంపిక చేసిన సెలెక్టర్లు టీ20ల్లో షెఫాలీకి, వన్డేల్లో దీప్తి శర్మకు వైస్ కెప్టెన్సీ అప్పగించారు.